సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 20 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.18,500

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.18.500. కనిష్ఠంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.46

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ఠంగా రూ.46. కనిష్ఠంగా రూ.34 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
29.4°/20.6°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

13 మండలాల్లో వర్షం



జడివానతో చిత్తడిగా మారిన గంటల మారెమ్మ ఆలయం వద్ద జాతీయ రహదారి

పుట్టపర్తి అర్బన్‌: తుపాను ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకూ 13 మండలాల పరిధిలో 33.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా అమరాపురం మండలంలో 6.6 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఇక కొత్తచెరువు మండలంలో 4.4 మి.మీ, పుట్టపర్తి 4.2, మడకశిర 2.6, హిందూపురం 2.2, కదిరి 2, పెనుకొండ 2.0, లేపాక్షి 2.0, ధర్మవరం 1.8, నల్లమాడ 1.8, సోమందేపల్లి 1.6, గాండ్లపెంట 1, బుక్కపట్నం మండలంలో 1.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జడివానతో రోడ్లన్నీ చిత్తడిగా మారిపోయాయి. ముఖ్యంగా బత్తలపల్లి సమీపంలోని గంటలమారెమ్మ కనుమ వద్ద రెండు నెలలుగా ఎన్‌హెచ్‌–342 పనులు సాగుతుండటంతో ఆ రోడ్డు అధ్వానంగా మారింది. అసలే గుంతలమయమైన రోడ్డు తాజా వర్షంతో చిత్తడిగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నూర్‌ మహమ్మద్‌ను కస్టడీకి ఇవ్వండి

- కోర్టులో పిటీషన్‌ వేసిన పోలీసులు!
- 'ఉగ్ర' వాట్సాప్‌ గ్రూపుల్లో చాట్‌ చేసిన మరో ఇద్దరు గుర్తింపు

ధర్మవరం: ఉగ్రవాదులతో సంబంధమున్న నూర్‌ మహమ్మద్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటీషన్‌ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులకు సంబంధించిన వాట్సాప్‌ గ్రూపుల్లో చాటింగ్‌ చేస్తున్న ధర్మవరానికి చెందిన నూర్‌ మహమ్మద్‌ను నాలుగురోజుల క్రితం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌ విధించడంతో కడప జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసును పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే నూర్‌ మహమ్మద్‌కు సంబంధం ఉన్న ఉగ్రవాదులకు సంబంధించిన వాట్సాప్‌ గ్రూపుల్లో కీలకమైన ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. నూర్‌ మహమ్మద్‌తోపాటు ఉగ్రవాదుల వాట్సాప్‌ గ్రూపుల్లో చాటింగ్‌ చేస్తున్న ఉత్తరప్రదేశ్‌, మధ్యప్రదేశ్‌ రాష్ట్రాలకు చెందిన మరో ఇద్దరిని పోలీసులు గుర్తించడంతో వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వారిద్దరిని అరెస్టు చేసి ధర్మవరానికి తీసుకువచ్చేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు ఆయా రాష్ట్రాలకు వెళ్లినట్లు తెలుస్తోంది. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తే మరిన్ని వివరాలు బయటపడే అవకాశాలున్నాయి.

'ఓపెన్‌' అడ్మిషన్ల గడువు పొడిగింపు

పుట్టపర్తి: ఏపీ ఓపెన్‌ స్కూల్‌ పదో తరగతి, ఇంటర్మీడియెట్‌ అడ్మిషన్ల (2025–2026 విద్యా సంవత్సరానికి) గడువు పొడిగించినట్టు డీఈఓ జి.కిష్టప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్‌ 15వ తేదీ వరకూ రూ.200 అపరాధ రుసుంతో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. పదో తరగతిలో చేరేందుకు 14 ఏళ్లు, ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌ను లేదా సమీపంలోని ఏఐ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ రహదారిపై ఘర్షణ

- ఐదుగురికి గాయాలు



గాయపడి వారికి వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు... బుక్కపట్నంకు చెందిన సుబ్రహ్మణ్యం, నవీన్‌ సుధీర్‌కుమార్‌, మహేష్‌, బెల్లం కృష్ణ మంగళవారం ఉదయం కారులో నసనకోటకు వెళ్లారు. సాయంత్రం తిరిగి స్వగ్రామం వెళ్తుండగా... చెన్నేకొత్తపల్లి దాటగానే జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వారు వాహనాన్ని అడ్డగించారు. అకారణం దాడి చేసి సుబ్రహ్మణ్యం, నవీన్‌ సుధీర్‌కుమార్‌, మహేష్‌, బెల్లం కృష్ణను గాయపరిచారు. స్థానికులు వారిని చెన్నేకొత్తపల్లి ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇతని పేరు రఘు. అగళి మండలం అలూడి గ్రామం. రెండుకాళ్లు వంకర్లు పోయి నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి. 2010లో సదరం శిబిరానికి వెళ్లగా పరీక్షించిన వైద్యులు 81 శాతం వికలత్వం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. అప్పటి నుంచి ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌ మొత్తంతోనే బతుకు వెళ్లదీస్తున్నాడు. తాజాగా కూటమి సర్కార్‌ రీవెరిఫికేషన్‌ పేరుతో రఘు పింఛన్‌ తొలగిస్తున్నట్లు నోటీసులిచ్చింది.



ఈమె పేరు వడ్డిగేరమ్మ. అగళి మండల పరిధిలోని రామపురం గ్రామం. ఒక కాలు పూర్తిగా సచ్చుబడగా... మనిషి తోడు లేకపోతే ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి. 2010లో సదరం శిబిరానికి హాజరు కాగా, వైద్యులు పరిశీలించి 72 శాతం వికలత్వం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. 2010 నుంచి ఆమె దివ్యాంగ పింఛన్‌ తీసుకుంటోంది. ఇన్నాళ్లూ ఆమె ఆలనా, పాలనా తల్లిదండ్రులు చూసుకునేవారు. ఈ మధ్యే తల్లిదండ్రులు కూడా చనిపోవడంతో వడ్డిగేరమ్మ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో అండగా నిలివాల్సిన పాలకులు ఆదరవుగా ఉన్న పింఛన్‌ కూడా తీసేసి నిర్దయగా వ్యవహరించారు.



ఇతని పేరు వడ్డి వెంకటేశులు. చిలమత్తూరు మండలం మదిరేపల్లి గ్రామం. ప్రమాదంలో ఎడమకాలు పూర్తిగా దెబ్బతినింది. నడిచేందుకు కూడా వీలుకాని పరిస్థితి. 2011లో సదరం శిబిరానికి హాజరు కాగా, పరీక్షించిన వైద్యులు 74 శాతం వికలత్వం ఉన్నట్టు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. అప్పటి నుంచి వెంకటేశు దివ్యాంగ పింఛన్‌ అందుకుంటూ ఆ డబ్బుతోనే జీవనం సాగిస్తున్నాడు. కానీ ఇప్పుడు కూటమి సర్కార్‌ వెంకటేశులు పింఛన్‌ తొలగిస్తున్నట్లు నోటీసులిచ్చింది.



ఈ యువతి పేరు కళావతి. చిలమత్తూరు మండలంలోని పలగలపల్లి పంచాయతీ కల్లుకుంట గ్రామం. నడవలేని స్థితిలో ఉన్న ఆమె 2012 సదరం శిబిరానికి వెళ్లగా...పరీక్షించిన వైద్యులు 89 శాతం వికలత్వం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ప్రతి నెలా పింఛన్‌ తీసుకుంటోంది. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం కళావతి పింఛన్‌ తొలగిస్తూ నోటీసు ఇచ్చింది.



పింఛన్‌ కోత.. తీరని వెత

SAKSHI గ్రౌండ్‌ రిపోర్ట్‌



ఇష్టానుసారం దివ్యాంగుల పింఛన్లు రద్దు

- అర్హత ఉన్నా తొలగించిన కూటమి సర్కార్‌
- నడవలేని స్థితిలో ఉన్న వారి పింఛన్లూ రద్దు
- కన్నీటి పర్యంతమైన దివ్యాంగులు
- మంగళవారం పలుచోట్ల ఆందోళనలు
- పునరుద్ధరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని వెల్లడి

సాక్షి నెట్‌వర్క్‌/చిలమత్తూరు: కొందరు నడవలేరు.. కొందరు చూడలేరు.. ఇంకొందరు మాట్లాడలేరు.. వీరంతా మనిషి తోడులేకపోతే జీవనం సాగించలేరు. అలాంటి వారిపైనా కూటమి సర్కార్‌ కక్షగట్టింది. దివ్యాంగులన్న కనికరం లేకుండా ఆదరువుగా ఉన్న పింఛన్‌ రద్దు చేస్తున్నట్లు నోటీసులిచ్చింది. దీంతో దివ్యాంగుల జీవితాలు ప్రశ్నార్థకమయ్యాయి. పింఛన్‌ సొమ్ము అందకపోతే చాలా మందికి కనీసం తిండి కూడా దొరకని పరిస్థితి. అందుకే కూటమి కుట్రలపై ఆగ్రహం పెల్లుబుకుతోంది. దివ్యాంగులు సైతం రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు. అన్ని అర్హతలున్న తమ పింఛన్లు ఎందుకు తీసేశారంటూ ప్రశ్నిస్తున్నారు.

రీవెరిఫికేషన్‌ పేరుతో కుట్ర

కూటమి సర్కార్‌ రీవెరిఫికేషన్‌ పేరుతో దివ్యాంగులపై కుట్ర చేసింది. వైద్యుల సాయంతో ఇష్టానుసారం వికలత్వ శాతం నమోదు చేసి అర్హుల పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులిచ్చింది. దీంతో జిల్లాలోని పలువురు దివ్యాంగులు నోటీసులు తీసుకుని మండల కార్యాలయాలకు వెళ్లారు. న్యాయం చేయండయ్యా అంటూ అధికారులను వేడుకున్నారు. జిల్లాలోని వేలాది మంది దివ్యాంగులను పింఛన్‌ అర్హుల జాబితా నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. దీంతో వారంతా మంగళవారం మండల, జిల్లా కార్యాలయాలకు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. అకారణంగా పింఛన్లు తొలగించి తమకు అన్యాయం చేయొద్దని అధికారులను వేడుకున్నారు.

అర్హత ఉన్నా తొలగించారు

ధర్మవరం రూరల్‌: అర్హత ఉన్నా తమ పింఛన్లను తొలగించారంటూ మంగళవారం పలువురు దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. కేవలం పింఛన్‌ డబ్బులతోనే జీవనం సాగిస్తున్న తమకు అన్యాయం చేయొద్దని కొందరు దివ్యాంగులు కన్నీటి పర్యంతమయ్యారు.

అగళిలో 98 మందికి నోటీసులు



అగళి ఎంపీడీఓ కార్యాలయం వద్ద దీనంగా ఉన్న దివ్యాంగులు

అగళి: మండలంలో 98 మంది దివ్యాంగుల పింఛన్లు రద్దు చేస్తున్నట్లు సచివాలయ ఉద్యోగులు నోటీసులిచ్చారు. దీంతో ఆందోళనకు గురైన పింఛన్‌దారులు మంగళవారం మండల పరిషత్‌ కార్యాలయానికి పరుగులు తీశారు. అయ్యా తాము నిజంగా దివ్యాంగులమని, చూస్తేనే తమ పరిస్థితి తెలుస్తుందన్నారు. తమకు పింఛన్‌ ఇప్పించి ఆదుకోవాలని కనిపించిన ప్రతి ఒక్కరినీ వేడుకున్నారు. ప్రస్తుతం మండల పరిధిలోని ఇనగలూర్‌లో 15, రావుడిలో 21, హళ్లికెరలో 6, మధూడిలో 3, ఇరిగేపల్లి–1 పరిధిలో 5, కోడిపల్లిలో 7, అగళిలో 14, ఆర్‌జీ పల్లిలో 8, పీ బ్యాడగేరలో 11, నరసంబూదిలో 8 చొప్పున మొత్తం 98 మంది పింఛన్లు తొలగిస్తున్నట్లు అధికారులు నోటీసులిచ్చారు.

పింఛన్ల కోతపై కన్నెర్ర



బత్తలపల్లి కూడలిలో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు, బాధితులు

- అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు పునరుద్ధరించాలి
- ఇష్టానుసారం రీవెరిఫికేషన్‌ చేసిన వైద్యులపైన చర్యలు తీసుకోవాలి
- బత్తలపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఆందోళన

బత్తలపల్లి: పింఛన్‌ కోతలపై దివ్యాంగులు కన్నెర్ర చేశారు. అన్ని అర్హతలున్న తమకు పింఛన్‌ ఎందుకు తొలగించారో చెప్పాలంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 512 మంది దివ్యాంగుల పింఛన్లు రద్దు చేస్తూ సోమవారం సచివాలయాల సిబ్బంది నోటీసులిచ్చారు. దీంతో మంగళవారం వారంతా బత్తలపల్లికి చేరుకున్నారు. సీపీఐ నాయకులతో కలిసి బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారాకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని అక్కడ బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీఓ నరసింహనాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కమతం కాటమయ్య, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్‌ మాట్లాడుతూ... రీవెరిఫికేషన్‌ పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన దివ్యాంగుల సర్టిఫికెట్లు తీసుకుని వాటిని కనీసం పరిశీలించకుండానే వికలత్వ శాతం తక్కువగా నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన దివ్యాంగులందరి పింఛన్లను పునరుద్ధరించాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఇదే అంశంపై సోమవారం పింఛన్లు రద్దు అయిన లబ్ధిదారులతో కలిసి కలెక్టర్‌ను కలుస్తామన్నారు.

పింఛన్ల తొలగింపు దుర్మార్గం

- రొళ్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దివ్యాంగుల నిరసన

రొళ్ల: అర్హులమైనా తమ పింఛన్లు తొలగించడంపై దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రీవెరిఫికేషన్‌ తర్వాత 40 శాతం కంటే తక్కువ వికలత్వం ఉన్నందున పింఛన్‌ తొలగిస్తున్నట్లు సచివాలయ సిబ్బంది సోమవారం పలువురు దివ్యాంగులకు నోటీసులిచ్చారు. ఈ క్రమంలో మండల పరిధిలోని సీఎం ఘట్ట, సోమఘట్ట, బంద్రేపల్లి, ఎంఆర్‌ గొల్లహట్టిలతో పాటు జీజీ హట్టి, రొళ్ల ఎస్సీ కాలనీకి తదితర గ్రామాలకు చెందిన దివ్యాంగులు ప్రేమ, సంజన, కుమారప్ప, సిద్దగంగమ్మ, రమేష్‌, నరసింహప్ప, లక్ష్మమ్మ, మల్లక్క, గిరిజమ్మ, లక్ష్మక్క తదితరులు మంగళవారం మండల ప్రజా పరిషత్‌ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. అన్ని అర్హతలున్న తమ పింఛన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. వీరి ఆందోళనకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ నరసింహారెడ్డి, పార్టీ నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ సీపీ నాయకులు మాట్లాడుతూ... అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త పథకాలు పక్కన పెట్టి ఉన్న పథకాలకు కోత పెడుతోందని మండిపడ్డారు. చివరకు దివ్యాంగుల పింఛన్ల రద్దుకు దిగడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పింఛన్‌ లబ్ధిదారులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలన్నారు. పింఛన్‌ తొలగింపు కోసం ఇచ్చిన నోటీసులను రద్దు చేసి అర్హులందరికీ యథావిధిగా పింఛన్‌ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని మండల పరిషత్‌ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పింఛన్‌ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



రొళ్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ నరసింహారెడ్డితో కలిసి నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు

మా పింఛన్‌ ఎందుకు తొలగించారు

- ఎంపీడీఓను నిలదీసిన దివ్యాంగులు



తాడిమర్రి ఎంపీడీఓ కార్యాలయం ముందు నోటీసులు చూపుతున్న పింఛన్‌దారులు

తాడిమర్రి: ఎలాంటి పరిశీలన చేయకుండానే ఇష్టానుసారం పింఛన్లు తొలగించడంపై దివ్యాంగులు మండిపడ్డారు. పింఛన్‌ రద్దు నోటీసు అందుకున్న వారంతా కూటమి సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని తాడిమర్రి, పిన్నదరి, కునుకుంట్ల, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి, రామాపురం తదితర గ్రామాలకు చెందిన 50 మంది దివ్యాంగ పింఛన్‌దారులు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అర్హత ఉన్నా తమ పింఛన్‌ ఎందుకు తొలగించారో చెప్పాలంటూ నిలదీశారు. దీంతో ఎంపీడీఓ స్పందిస్తూ.. పింఛన్‌ గురించి ఎవరూ ఆదోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం నిర్వహించనున్న రీఅసెస్మెంట్‌కు హాజరు కావాలన్నారు. ఒక అప్లికేషన్‌పై డిజిటల్‌ అసిస్టెంట్‌తో సంతకం చేయించుకుని, ఆధార్‌ కార్డు, సదరం సర్టిఫికెట్‌లతో పాటు సచివాలయ ఉద్యోగులు అందించిన నోటీసులను తీసుకుని వచ్చి రీ అసెస్మెంట్‌ చేసుకోవాలని ఆయన సూచించారు.

తాగండి.. తాగి ఊగండి..!

ఖజానాకు ఫుల్‌ కిక్కు

- ఇక నుంచి అర్ధరాత్రి 12 వరకు బార్‌లు
- ఉదయం 10 గంటలకే ఓపెన్‌
- కొత్త బార్‌ పాలసీ ప్రకటించిన కూటమి సర్కార్‌



కదిరి: ఇక నుంచి తాగినోడికి తాగినంత. వేళాలేదు. పాళా లేదు. రాత్రింబవళ్లు కిక్కే కిక్కు. బాగా తాగండి. తాగి ఊగండి..ఇదీ కూటమి ప్రభుత్వ లక్ష్యం. కొత్త బార్‌ల మద్యం పాలసీతో రోజంతా మద్యం అందుబాటులోకి రానుంది. జిల్లాలో ఇప్పటికే ఏరులై పారుతున్న మద్యం ప్రవాహం ఇకపై మరింత ఉధృతంగా ప్రవహించనుంది.

జిల్లాలో 11 బార్ల ఏర్పాటుకు అనుమతి

జిల్లాలో ఇప్పటికే 87 మద్యం దుకాణాలున్నాయి. వాటికి అనుబంధంగా ఈ మధ్యే పర్మిట్‌ రూమ్‌లకు కూడా కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇక అనధికారికంగా పల్లె పల్లెలో బెల్ట్‌ షాప్‌లు వెలిశాయి. రోజూ రూ.2 కోట్ల వరకూ మద్యం వ్యాపారం నడుస్తోంది. తాజాగా కూటమి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 11 బార్‌లకు లైసెన్స్‌లు మంజూరు చేసేందుకు సోమవారం(18న) గెజిట్‌ నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ఇందులో కదిరిలో 3, ధర్మవరంలో 3, హిందూపురంలో 3, మడకశిరలో 1, పెనుకొండలో ఒక బార్‌ ఏర్పాటు చేయనున్నారు. 50 వేలలోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షలుపైబడి జనాభా ఉంటే రూ.75 లక్షలు చొప్పున ప్రతి ఏటా లైసెన్స్‌ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు రూ.5 లక్షల ధరావతు చెల్లించాల్సి ఉంటుంది. ఇది వాపసు ఇవ్వరు. లాటరీ విధానంలో ఎంపిక ఉంటుంది. ఒక్కో బార్‌కు కనీసం 4 దరఖాస్తులు తప్పనిసరిగా ఉంటేనే లాటరీ తీస్తారు. లేదంటే మళ్లీ వాయిదా పడుతుంది. ఈ నెల 28 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలి. 28వ తేదీన ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని సాయి ఆరామంలో లక్కీడ్రా ఉంటుంది. గతంలో రెండు బార్‌లు ఉన్న చోట ఆ సంఖ్యను మూడుకు పెంచింది. సెప్టెంబర్‌ 1వ తేదీ నుండి మూడేళ్ల పాటు ఈ బార్‌లకు అనుమతి ఉంటుంది.

అర్ధరాత్రి వరకూ అనుమతి

గతంలో జగన్‌ ప్రభుత్వం ప్రతి ఏటా మద్యం దుకాణాలతో పాటు బార్‌ల సంఖ్య తగ్గిస్తూ వచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కాస్త కఠినంగానే వ్యవహరించిది. బార్‌లు కూడా ఉదయం 11 గంటలకు తెరిచి రాత్రి 11 గంటలకే మూసి వేయాలని ఆదేశించింది. కానీ కూటమి ప్రభుత్వం ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటలు వరకూ బార్‌లు తెరుచుకునేలా ఉత్తర్వులు ఇచ్చింది. గతంలో రూ.66 లక్షలుగా ఉన్న బార్‌ లైసెన్స్‌ ఫీజును రూ.55 లక్షలకు తగ్గించింది. గతంలో ఉన్న టెండర్‌ విధానాన్ని కూడా రద్దు చేసి లాటరీ విధానాన్ని తీసుకొచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని పక్కనబెట్టి ఆదాయమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మహిళాలోకం మండిపడుతోంది.

తాగుడును ప్రోత్సహించడమే



కూటమి సర్కార్‌ చర్యలు చూస్తుంటే తాగుడును ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి వరకూ బార్‌లు తెరుచుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జగనన్న ప్రభుత్వం మద్యం షాప్‌లు, బార్‌ల సంఖ్య తగ్గిస్తూ వస్తే ఈ ప్రభుత్వం పెంచుతూ వస్తోంది. ప్రజల ఆరోగ్యం ఈ ప్రభుత్వానికి పట్టదు. మా ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయాలు సగటున 30 శాతం, బీర్‌ల విక్రయాలు సగటున 57 శాతం తగ్గాయి. ఇప్పుడు సందు సందులోనూ మందు దొరుకుతోంది.

–ఉషశ్రీచరణ్‌, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌ సీపీ

అర్ధరాత్రి వరకూ అవకాశం ఉంది



జిల్లాలో 11 బార్లకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. కొత్త మద్యం పాలసీ ప్రకారం ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ బార్‌లు తెరిచి ఉంచుతారు. లైసెన్స్‌ ఫీజు కూడా గతంలో కన్నా తగ్గింది. అలాగే లైసెన్స్‌ ఫీజు ఒకే సారి కాకుండా 6 సమాన వాయిదాల్లో చెల్లించే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

–గోవిందు నాయక్‌, జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌

పోక్సో కేసులో ముద్దాయికి 13 ఏళ్ల జైలు

హిందూపురం: బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో ముద్దాయి వడ్డే బెంగళూరు సుధాకర్‌కు అనంతపురంలోని పోక్సో కోర్టు 13 ఏళ్ల జైలు, రూ.8 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. హిందూపురం వన్‌టౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... హిందూపురం లక్ష్మీపురానికి చెందిన వడ్డే బెంగళూరు సుధాకర్‌ ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి బెంగళూరు, కదిరి తదితర ప్రాంతాలకు తీసుకువెళ్లి లాడ్జిలలో లైంగిక దాడి చేశాడు. దీనిపై 2022 జనవరి 7వ తేదీన బాలిక తండ్రి ఫిర్యాదు చేయగా...వన్‌ టౌన్‌ ఎస్‌ఐ దాదాపీర్‌, సీఐ ఇస్మాయిల్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్ష్యాధారాలతో ఛార్జ్‌ షీట్‌ దాఖలు చేశారు. కేసు నమోదైనప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్న ముద్దాయి సుధాకర్‌ బెంగళూరులో ఉన్నట్లు గుర్తించిన ఇటీవలే పట్టుకుని వచ్చి న్యాయమూర్తి ఆదేశాలతో సబ్‌జైల్‌కు తరలించారు. ఈ కేసు మంగళవారం అనంతపురంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుటకు రాగా, జడ్జి చిన్నబాబు కేసు పూర్వాపరాలను పరిశీలించారు. నేరం రుజువు కావడంతో బాలికపై లైంగిక దాడి చేసినందున ముద్దాయి బెంగళూరు సుధాకర్‌కు పదేళ్ల జైలు, రూ.5 వేల జరిమానాతోపాటు బాలికను బెదిరించినందుకు మరో మూడేళ్ల జైలు, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

క్లుప్తంగా

రాష్ట్ర ఫుట్‌బాల్ చాంపియన్‌గా జిల్లా జట్టు



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా ఫుట్‌బాల్ జట్టు సభ్యులు

హిందూపురం టౌన్: విశాఖ వేదికగా రెండు రోజులుగా సాగుతున్న రాష్ట్ర సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించింది. ఈ మేరకు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేవీ అనిల్ కుమార్ మంగళవారం తెలిపారు. జిల్లా జట్టు ఆడిన అన్ని మ్యాచుల్లోనూ విజయం సాధించి ఫైనల్‌కు చేకుని విశాఖపట్నం జట్టుతో మంగళవారం తలపడిందన్నారు. భారీ వర్షం కారణంగా మ్యాచ్‌ను రద్దు చేసి ఇరు జట్లను ఉమ్మడి విజేతగా ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా కోచ్‌గా వ్యవహరించిన బీకే మహమ్మద్ సలీమ్, మేనేజర్ ఇర్షాద్ అలీ, జట్టు క్రీడాకారులను అభినందించారు.

హత్యాయత్నం కేసు నమోదు

కదిరి టౌన్: ఓ యువతిని ప్రేమించిన విషయంగా కక్ష పెంచుకుని కొందరు తనను చంపడానికి ప్రయత్నించారంటూ కదిరిలోని దేవాలం వీధికి చెందిన యువకుడు సాయికిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. గతంలో ఓ అమ్మాయిని ప్రేమించిన విషయంలో కక్ష పెంచుకున్న శివ, పవన్, సాయికిరణ్, కళ్యాణ్ ఈ నెల 17న రాత్రి సాయికిషోర్‌ను అతని ఇంటి నుంచి బలవంతంగా మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని వారి ఇంటి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ కట్టెలతో దాడి చేసి, రాయి వేసి చంపే ప్రయత్నం చేయడంతో చుట్టుపక్కల వారు అడ్డుకుని కాపాడారు. గాయపడిన సాయికిషోర్‌ను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుల్లో శివ, పవన్‌తో పాటు ఒకరు కదిరి పీఎస్‌లో 7 కేసుల్లో , మరొకరు 6 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరిపై రౌడీషీట్ తెరిచినట్లు పోలీసులు తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ వివాహిత చేసిన ఫిర్యాదు మేరకు అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు ధర్మవరం టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ధర్మవరంలోని సుందరయ్యనగర్‌కు చెందిన తుంగా రేఖకు కొత్తపేటకు చెందిన పట్టు చీరల వ్యాపారి రంగం ఆంజనేయులుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో 14తులాల బంగారాన్ని రేఖ తల్లిదండ్రులు ఇచ్చారు. వీరికి సంతానం లేదు. పెళ్లి అయిన మూడు నెలల వరకూ వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత ఆంజనేయులు చెడు వ్యసనాలకు బానిస కావడంతో పాటు భార్య బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో నష్టపోయాడు. ఈ విషయాన్ని తన అత్త, మామకు చెప్పినా వారు ఆంజనేయులుకే వత్తాసు పలికారు. దీంతో విషయాన్ని తన తల్లిదండ్రుల వద్ద చెప్పుకుని రేఖ బాధపడింది. ఆ సమయంలో పంచాయితీ నిర్వహించి సర్ది చెప్పారు. అయినా ఆంజనేయులులో మార్పు రాలేదు. రెండేళ్లుగా అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్త, మామ తరచూ రేఖను వేధిస్తుండడంతో తాళలేక ఆమె పుట్టింటికి చేరుకుంది. అయినా డబ్బు కావాలని వేధిస్తుండడంతో భరించలేక రేఖ చేసిన ఫిర్యాదు మేరకు ఆంజనేయులు, అత్త లక్ష్మీదేవి, మామ రామచంద్రపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కరెంట్‌తో ఆటలొద్దు


సందీప్‌రెడ్డి (ఫైల్)

ఇతని పేరు సందీప్‌రెడ్డి. సీకేపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామం. భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. తన సొంత పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గత సోమవారం ఉదయం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన సందీప్‌రెడ్డి.. మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ పెట్టెను తాకగానే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నపాటి అజాగ్రత్త కారణంగా ఆ కుటుంబం దిక్కులేనిదైంది. చిరు జల్లులు కురుస్తున్న సమయంలో స్టార్టర్ పెట్టెకు విద్యుత్ తీగలు కరెంట్ ప్రసారం అవుతుండడం గుర్తించలేక 35వ ఏటనే కుటుంబానికి దూరమయ్యాడు.

... వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ అనుసంధాన పరికరాలతో అప్రమత్తంగా ఉండకపోతే ప్రాణానికే ముప్పు అనేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ వెలుగు చూస్తున్నాయి.

- వర్షాకాలంలో విద్యుత్ తీగలతో జాగ్రత్త
- మోటార్ స్టార్టర్లతో పొంచి ఉన్న ప్రమాదం
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికి ముప్పే
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు చెక్


ప్రమాదకర స్థితిలో వరి మడిలో అమర్చిన స్టార్టర్ పెట్టె

పుట్టపర్తి టౌన్: అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే రైతులు తమ పొలాల్లో వివిధ రకాల పంటసాగు చేపట్టారు. పంటలకు నీరు పెట్టడానికి ఉదయం నుంచి సాయంత్రం వరకూ విద్యుత్ తీగలు, మోటార్ల వద్దనే గడుపుతున్నారు. ఈ క్రమంలో సాంకేతిక సమస్యలు ఏవైనా ఉత్పన్నమైతే తమకున్న పరిజ్ఞానం మేరకు మరమ్మతులకు ఉపక్రమిస్తుంటారు. ఇలాంటి సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే మృత్యువాత పడే ప్రమాదముంది. పొలాల్లో కర్ర స్తంభాలు, వేలాడుతున్న తీగల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం తప్పదని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

స్టార్టర్ పెట్టెలతో జాగ్రత్త

పొలాల్లో బోరుబావులకు సమీపంలోనే మోటార్ స్టార్టర్ పెట్టెలను రైతులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే వీటిని బయలు ప్రదేశంలోనే ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంచేస్తున్నారు. వర్షం కురిసినా, బోరు బావుల నుంచి ఎగజిమ్మిన నీరు స్టార్టర్ పెట్టెలోకి చేరుకుంటోంది. పెట్టెలు తీగలు గజిబిజిగా ఉంటే ఏరికోరి ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లవుతుంది. ఈ సమస్య నుంచి బయటపడేందుకు స్టార్టర్ పెట్టెలకు సరైన భద్రత కల్పించాలి. విద్యుత్ తీగలు ఎండకు ఎండి పాడి బారిపోకుండా వాటికి రక్షణగా ప్లాస్టిక్ పైపులు ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం. పాడిబారిన విద్యుత్ తీగల వల్ల ఇన్సులేటర్ దెబ్బ తిని తీగలు బయటపడే ప్రమాదముంది. ఈ తీగలు స్టార్టర్ పెట్టెను తగులుకుని ఉండడంతో కరెంట్ ప్రసరించి ప్రమాదాలకు కారణమవుతుంది. మోటార్ ఆన్ చేసే ముందు ఒకసారి టెస్టర్ సాయంతో స్టార్టర్ పెట్టెను చెక్ చేసుకోవడం ద్వారా ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

విద్యుత్ తీగలతో ప్రమాదం

గాలీవానకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతుంటాయి. వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో, తిరిగి ఇంటికి చేరుకునే సమయంలో విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తలు వహించాలి. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలున్నా.. తెగి పడి ఉన్నా వెంటనే వాటికి దూరంగా వైదొలిగి పోవాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ వాటిని చేతితో తాకరాదు. చోరీల భయంతో కొందరు రైతులు పంటకు నీరుపెట్టగానే విద్యుత్ వైర్లను ఇంటికి తీసుకెళుతుంటారు. మరుసటి రోజు మళ్లీ పొలానికి తీసుకెళ్లి స్టార్టర్ పెట్టకు అనుసంధానిస్తూ ఉంటారు. అనుసంధానించేందుకు ముందు తీగలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. ఎక్కడైనా ఎలుకలు కొరికి ఉన్నట్లుగా ఉంటే వెంటనే ఇన్సులేటర్ టేప్ చుట్టాలి. వైర్ పాతబడితే వాటిని మార్చి కొత్త వాటిని అమర్చుకోవాలి. స్టార్టర్ పెట్టెకు పటిష్టమైన ఎర్త్ ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాల తీవ్రత తగ్గే అవకాశముంది.

జాగ్రత్తలు పాటించాలి



వర్షానికి తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లను తాకరాదు. పొలాల్లో స్టార్టర్లు మరమ్మతులకు గురైతే ఎలక్ట్రీషియన్‌తోనే రిపేరీ చేయించాలి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్వయంగా ఫీజులు వేయడం లాంటి పనులు చేయరాదు. పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరి చేయించాలి. విద్యుత్ ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

– సాయినాథ్‌గౌడ్, విద్యుత్ శాఖ ఏఈ, పుట్టపర్తి

ఆటో బోల్తా - బాలుడి మృతి


నందకిషోర్ (ఫైల్)

ముదిగుబ్బ: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ముదిగుబ్బ మండలం సీసీరేవు గ్రామానికి చెందిన నందకిషోర్ (14) సెల్‌ఫోన్ రిపేరి కోసం తన స్నేహితులతో కలసి మంగళవారం ఆటోలో ముదిగుబ్బకు వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం వెళుతుండగా సిద్ధన్నగారిపల్లి వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన నందకిషోర్‌ను అనంతపురం లోని జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

కదిరి అర్బన్: మండలంలోని కొండమనాయుని పాలెం గ్రామ సమీపంలో మంగళవారం గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. గంజాయి తరలింపు వెనుక ఉన్నది ఎవరనే అంశంపై పోలీసులు రహస్యంగా విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బాలుడి దుర్మరణం


టిప్పర్ చక్రాల కింద ఇరుక్కున్న వినయ్ మృతదేహం

కనగానపల్లి: టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ బాలుడిని బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని పావగడ తాలూకా సోలేపల్లికి చెందిన రామాంజినేయులు మంగళవారం సాయంత్రం తన కుమారుడు వినయ్ (7)తో కలసి ద్విచక్ర వాహనంపై అనంతపురం నుంచి కనగానపల్లి మీదుగా వారి స్వగ్రామానికి బయలుదేరాడు. తల్లిమడుగుల వద్దకు చేరుకోగానే ఎదురుగా వెళుతున్న టిప్పర్ వాహనాన్ని డ్రైవర్ సడన్‌గా ఆపి రివర్స్ చేశాడు. టిప్పర్ వెనుకలే ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో కొడుకుతో పాటు రామాంజనేయులూ కిందపడ్డారు. బాలుడి తలపై టిప్పర్ చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే చెందాడు. రామాంజనేయులు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సహజ కాలువలు పునరుద్ధరించండి

- జలసాధన సమితి కార్యదర్శి గంగిరెడ్డి

హిందూపురం: హంద్రీ–నీవా కాలువ పనుల్లో భాగంగా పూడ్చి వేసిన సహజ కాలువలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి డిమాండ్ చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల మీదుగా మడకశిర నియోజకవర్గం అమరాపురం వరకూ హంద్రీ–నీవా కాలువ తవ్వేటప్పుడు వర్షపు నీరు చెరువులకు చేరవేసే సహజ కాలువలను పూడ్చి పనులు అరకొరగా చేశారని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరద గట్లను తెంచుకుని హంద్రీ–నీవా కాలువలో చేరడం ద్వారా ఇసుక, మట్టి పేరుకుపోతోందన్నారు. సహజంగా చెరువులకు చేరాల్సిన నీరు కాస్త హంద్రీ–నీవా కాలువలోకి చేరుతోందన్నారు. ఫలితంగా చెరువులు నిండక ఆయకట్టు రైతులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. సహజ కాలువలు పూడిపోకుండా హంద్రీ–నీవా కాలువలపై బ్రిడ్జిలు నిర్మించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. వెంటనే సహజ కాలువల్లో పూడిక తీసి వర్షం నీరు చెరువులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పనులు పూర్తి చేయడానికి అవసరమైన రూ.11 కోట్ల నిధుల కోసం హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల శాసనసభ్యులు కృషి చేయాలని విన్నవించారు.

సెలవులో జెడ్పీ సీఈఓ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి(సీఈఓ) శివశంకర్ సెలవులో వెళ్లారు. 10 రోజుల సెలవు కావాలని ఆయన లెటర్ పెట్టగా.. వారం రోజులకు మాత్రమే కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఆ తరువాత ఆయన సెలవు పొడిగించుకునే అవకాశం ఉంటుందని జెడ్పీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాగా, గత సీఈఓ రామచంద్రారెడ్డి పట్టుమని మూడు నెలలు తిరక్కనే ఆయనను టీడీపీ ఎమ్మెల్యేలు టార్గెట్ చేసి బలవంతంగా సాగనంపిన సంగతి దుమారం రేపింది. తరువాత శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో డ్వామా ఏపీడీగా పని చేస్తున్న శివశంకర్‌ను జెడ్పీ సీఈఓగా బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆయన రాకను ఓ ద్వితీయ శ్రేణి అధికారి జీర్ణించుకోలేక లోలోన పొగబెడుతుండడంతో చివరకు సెలవులో వెళ్లాల్సి వచ్చిందని జెడ్పీ ఉద్యోగులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మళ్లీ వస్తారో.. లేదో అనే విషయంపై చర్చ నడుస్తోంది.

బస్సు నుంచి కిందపడిన మహిళ

రాయదుర్గం టౌన్: బస్సును ఆపేందుకు కండక్టర్ నిరాకరించడంతో కదులుతున్న ఆర్టీసీ బస్సు నుంచి కిందపడి ఓ మహిళ గాయపడింది. అనంతపురం జిల్లా రాయదుర్గంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న ఎంఏసీ హౌసింగ్ లే అవుట్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. ఎంసీఏ లేవుట్ వద్ద నివాసం ఉంటున్న భూలక్ష్మి మంగళవారం ఉదయం ఉరవకొండకు వెళ్లి తిరిగి రాత్రి 9 గంటలకు రాయదుర్గానికి ఆర్టీసీ బస్సులో వచ్చింది. ఆమె దిగాల్సిన స్టాప్ రావడంతో ఫుట్‌బోర్డు సమీపంలోకి చేరుకుని బస్సు నిలపాలని కండక్టర్‌ను కోరింది. ఇందుకు కండక్టర్ నిరాకరించాడు. అప్పటికే బస్సు స్పీడ్ బ్రేకర్ల వద్దకు చేరుకోవడంతో డ్రైవర్ వేగాన్ని తగ్గించాడు. దీంతో బస్సు దిగేందుకు ప్రయత్నించిన ఆమె అదుపు తప్పి కిందపడింది. చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఆమెను అదే బస్సులో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

బాలికల భద్రతకు పటిష్ట చర్యలు : ఎస్పీ


విద్యార్థినితో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి అర్బన్: మహిళలు, బాలికల భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థల్లో డ్రగ్స్, ఈవ్‌టీజింగ్, డిజిటల్ అరెస్ట్, శక్తి యాప్, సైబర్ నేరాలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చెడు మార్గాల వైపు వెళితే జీవితం చిన్నాభిన్నం అవుతుందన్నారు. ర్యాగింగ్‌తో వచ్చే నష్టాలను వివరించారు. డ్రగ్స్ వినియోగంతో ఆరోగ్యం క్షీణిస్తుందని, మానవ సంబంధాలు దెబ్బతింటాయని, చదువులో వెనుకబడతారని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. శక్తి వాట్సాప్ (79934 85111), డయల్ 100, డయల్ 112, చైల్డ్ మ్యారేజస్ (1098), సైబర్ క్రైమ్ (1930)పై అవగాహన కల్పించారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ విజయ్‌భాస్కరరెడ్డి, డీఎస్పీ ఆదినారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ హేమచంద్రారెడ్డి, నోడల్ ఆఫీసర్ గోపీనాథరెడ్డి, సైబర్ క్రైమ్ సీఐ మోహన్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఈగల్ ఇన్‌చార్జ్ శ్రీధర్, సిబ్బంది సుదర్శన రెడ్డి, అశోక్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

- గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టి.కె.అనిల్‌కుమార్


స్టాళ్లను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్, సెర్ప్ సీఈఓ వాకాటి అరుణ

గుడిబండ: సహకార సంఘాలను బలోపేతం చేసి రైతులు, మహిళలను ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తాయని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టి.కె.అనిల్‌కుమార్ అన్నారు. గుడిబండ మండలం కరికెర, గుడిబండ గ్రామాల్లో సెర్ప్ సీఈఓ వాకాటి అరుణతో కలసి మంగళవారం ఆయన పర్యటించారు. ఎస్ఆర్ఎల్ఎం ప్రాజెక్ట్ ద్వారా ఏర్పాటు చేసిన జీవనోపాదుల సేవా కేంద్రాలను సందర్శించారు. అనంతరం గుడిబండలో ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, 'మన డబ్బులు– మన లెక్కలు' యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకాటి అరుణ మాట్లాడుతూ.. మన డబ్బులు– మన లెక్కలు యాప్‌లో మహిళా సంఘాల సభ్యుల పొదుపులు, చెల్లించిన అప్పుల వివరాలు, సంఘ సభ్యుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం, పారదర్శకమైన లెక్కలు ఉంటాయన్నారు. అనంతరం రైతు సంఘాల సభ్యులకు చేకూరిన లబ్ధి, ఎల్ఎస్‌సీ ఉపయోగాలు, అనుబంధ శాఖల సేవలపై కమిటీ సభ్యులతో చర్చించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెర్ప్ అదనపు సీఈఓ శ్రీరాములనాయుడు, స్త్రీనిధి ఎండీ హరిప్రసాద్, ఉన్నతి డైరెక్టర్ శివశంకర్‌ప్రసాద్, ఉమ్మడి జిల్లా డీఆర్‌డీఏ పీడీలు నరసయ్య, శైలజ, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


మాట్లాడుతున్న ఓబులు

పెనుకొండ: నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో ఇండోసెల్ కార్పొరేట్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణ ఆపాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. పెనుకొండలోని పౌరసరఫరాల హమాలీ యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించి, 80 శాతం ప్రజల ఆమోదం పొందిన తర్వాతనే భూసేకరణ చేయాలనే నిబంధనలు ఉన్నాయన్నారు. అయితే చట్టాన్ని తుంగలో తొక్కి బలవంతపు భూసేకరణ చేయడం దుర్మార్గమన్నారు. ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కరేడు గ్రామ రైతులు, ప్రజలకు సంఘీభావంగా ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, వివిధ ప్రజా సంఘాలు సోమవారం చేపట్టిన చలో కరేడు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తూ అక్రమ అరెస్టులకు తెరలేపిందని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ అనాలోచిత చర్యలతో వలసలు తప్పవని, రైతులకు ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరో గత్యంతరం ఉండదని అన్నారు. జిల్లాలోనూ సోలార్, ఏపీఐఐసీ కోసం ఎన్‌పీకుంట, గోరంట్ల, హిందూపురం, మడకశిర, రొద్దం తదితర ప్రాంతాల్లో సుమారు 60 వేల ఎకరాలను బలవంతంగా సేకరించే చర్యలు మానకపోతే పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటేష్, నాయకులు నరసింహులు, లక్ష్మీనారాయణ, బాబా, సాంబ, ఉషమ్మ, నాగరాజు, బాబావలి, బావమ్మ, గంగాధర్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- కేంద్రీయ విద్యాలయ అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం


కేంద్రీయ విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

గోరంట్ల: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కేంద్రీయ విద్యాలయ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని పాలసముద్రం వద్ద గల 'నాసిన్' ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయలో మంగళవారం విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఈ విద్యాసంవత్సరానికి కేటాయించిన బడ్జెట్, సిబ్బంది జీతాలు, స్కూల్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, విద్యాలయలో జరిగిన అడ్మిషన్లు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 2వ తేదీలోపు పేరెంట్స్, టీచర్స్ మీట్‌ను నిర్వహించాలన్నారు. సిలబస్, టైంటేబుల్, విద్యార్థుల సామర్థ్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో తెలిపి అధిగమించేందుకు తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలన్నారు. తరచూ పేరెంట్స్, టీచర్స్ మీట్‌లు నిర్వహించడం వల్ల విద్యార్థుల పఠన సామర్థ్యం, లోపాలు, మెరుగుదల మార్గాల గురించి తల్లిదండ్రులతో చర్చించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలన్నారు. సృజనాత్మక పద్ధతుల ద్వారా బోధన చేస్తే విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిపై వ్యక్తిగత శ్రద్ధ చూపించాలని ఆదేశించారు. విద్యాలయ శాశ్వత భవన నిర్మాణం, సిబ్బంది నియామకానికి సంబంధించిన ఫైలును కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్‌కు పంపిస్తామన్నారు. అసెంబ్లీ నిర్వహించే ప్రాంతంలో సిమెంట్ కాంక్రీట్ వేయాలని, విద్యార్థులు వేచి ఉండటానికి బస్‌షెల్టర్, స్పీడ్ బ్రేకర్లు, క్రీడామైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కేంద్రీయ విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో పాటు 'నాసిన్' డిప్యూటీ డైరెక్టర్ శేషు, విద్యాలయ ప్రిన్సిపల్ కృష్ణారావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖ పెట్రోల్ బంకుల్లో అక్రమాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జైళ్ల శాఖ కడప రేంజ్ డీఐజీ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో అవినీతి తవ్వేకొద్దీ బయట పడుతోంది. పలువురు సిబ్బంది బంకుల్లోని సొమ్ము కాజేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని పెట్రోల్ బంకు పరిధిలో అప్పటి డీఐజీ, అనంతపురం డీఎస్‌డీఓ, అక్కడ జైలర్‌గా పనిచేస్తూ బదిలీపై కడప కేంద్ర కారాగారానికి వచ్చిన మరో జైలర్, ధర్మవరంలో పనిచేస్తూ ప్రస్తుతం తాడిపత్రికి బదిలీపై వెళ్లిన డిప్యూటీ జైలర్ ఈ వ్యవహారంలో చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. సదరు డిప్యూటీ జైలర్ పెట్రోల్ బంకు నిర్వహణ ఛార్జ్ డీఎస్‌డీఓకు అప్పగించే క్రమంలో ఈ లొసుగులు బయటపడినట్లు తెలిసింది. రూ.20 లక్షల మేర పెట్రోల్ బంకు డబ్బులు, రూ.1.50 లక్షలు పీపీసీ (ప్రిజనర్స్ పార్టిసిపేషన్ క్యాష్) తక్కువగా ఉండడంతో డీఎస్‌డీఓ ఛార్జ్ తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో ప్రస్తుతం వార్డర్‌లే పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారు. అప్పటి కీలక అధికారి పెద్ద మొత్తంలో డబ్బును తన అవసరాలకు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ అధికారి తీసుకున్న మొత్తం డబ్బు బంధువులు, వార్డర్స్ ఫోన్‌పేల రూపంలో చెల్లించినట్లు సమాచారం. డిప్యూటీ జైలర్ తాను చెల్లించాల్సిన డబ్బును చెల్లించకపోవడం, ఇతర కారణాలతో అప్పట్లో డిపార్ట్‌మెంట్ అతన్ని డిస్మిస్ చేసింది. ఆ డిప్యూటీ జైలర్ వాడుకున్న మొత్తాన్ని ఎవరు కట్టాలో.. దిక్కుతోచక ఒక కమిటీని నియమించి కడప రేంజ్ డీఐజీ విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అలాగే నంద్యాల జిల్లా బనగానపల్లిలోని పెట్రోల్ బంక్‌లోనూ రూ. 62 లక్షల మేరకు అవినీతి జరిగినట్లు గుర్తించారు. అవినీతికి పాల్పడిన వారిలో ప్రధానంగా కర్నూలు డీఎస్‌డీఓతో పాటు, డిప్యూటీ జైలర్, ఓ హెడ్ వార్డర్ ఉన్నట్లు తెలిసింది. అవినీతికి ఊతమిచ్చిన డీఎస్‌డీఓకు అడిషనల్ ఎస్పీ ర్యాంక్‌తో పదోన్నతి కల్పించేందుకు రంగం సిద్ధమైన తరుణంలో అక్రమాలు బయటపడడం గమనార్హం.

'డీఎస్సీ' సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

అనంతపురం ఎడ్యుకేషన్: మెగా డీఎస్సీలో భాగంగా ప్రొవిజినల్ సెలక్షన్ జాబితాకు ఎంపికయ్యే అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ముగ్గురు సభ్యులుంటారు. ఎంఈఓ/హెచ్‌ఎంలు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. అభ్యర్థుల విద్యార్హతల మార్కులు, లోకల్, నాన్ లోకల్ తదితర సర్టిఫికెట్లను వీరు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం విజయవాడలో ఒక రోజు శిక్షణ కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబుతో పాటు పలువురు సిబ్బంది మూడు రోజులుగా అక్కడే మకాం వేసి జాబితా ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. నేడో, రేపో తాత్కాలిక ఎంపిక జాబితా వెలువడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అంతర్ జిల్లా చైన్‌స్నాచర్ల అరెస్ట్

- రూ.4 లక్షల విలువ చేసే బంగారు నగలు స్వాధీనం


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: సులువుగా డబ్బు సంపాదించేందుకు బంగారు చైన్‌లను లాక్కొని ఉడాయిస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా చైన్ స్నాచర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం మూడో పట్టణ పీఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ శాంతిలాల్ వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడకు కంబం నాగార్జున అలియాస్ నాగార్జున రెడ్డి ఉరఫ్ చిన్నా, బోజనోల వరప్రసాద్ అలియాస్ ప్రసాదు ఇద్దరూ మంచి స్నేహితులు. బతుకు తెరువు కోసం నాగార్జున అనంతపురానికి వలస వచ్చి విజయనగర కాలనీలో నివాసముంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వరప్రసాద్ సైతం కదిరికి వలస వెళ్లి అక్కడి ఎరికల కాలనీలో నివాసముంటున్నాడు. నాగార్జునకు పేకాట, మద్యం సేవించడం, ఇతర చెడు వ్యసనాల కారణంగా అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో అప్పులు, వ్యసనాలు తీర్చుకునేందుకు చైన్‌స్నాచింగ్‌లకు పథకం రచించి, వరప్రసాద్‌ను అనంతపురానికి రప్పించుకున్నాడు. అనంతరం ఇద్దరూ కలసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ వచ్చారు. ఈ ఏడాది జూన్ 21న నేషనల్ పార్క్ ఎదురుగా స్కూటీపై ఇద్దరు మహిళలను మోటార్ సైకిల్‌పై అనుసరిస్తూ స్కూటీ నడుపుతున్న ఆమెతో మాట కలిపి వెనుక చక్రంలో గాలి తగ్గిందని బుకాయించారు. వారి మాటలు నమ్మిన ఆమె స్కూటీని ఆపి వెనుక చక్రం వైపు తొంగి చూస్తుండగా మెడలోని బంగారు మాంగల్యం చైన్‌ను లాక్కొని ఉడాయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో మంగళవారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.4 లక్షల విలువ చేసే 23 గ్రాముల బరువు కలిగిన బంగారు చైను, 1.5 గ్రాముల బరువు ఉన్న ఒక బంగారు తాళిబొట్టు, ఒక బంగారు లక్ష్మీకాసు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.